# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 13-10-2024** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. ఆఫ్రికా దేశాలతో సంబంధాలను విస్తరించడం, బలోపేతం చేయడం లక్ష్యంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈరోజు ఆఫ్రికా దేశాల పర్యటనకు వెళ్లారు.
2. ప్రధాన మంత్రి గతిశక్తి జాతీయ బృహత్ ప్రణాళిక కార్యక్రమం ఈరోజుతో మూడు సంవత్సరాలు పూర్తిచేసుకుంది.
3. విజయవాడలో శరన్నవరాత్రి ఉత్సవాలు, తిరుపతి బ్రహ్మోత్సవాలు విజయవంతంగా నిర్వహించడంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హర్షం వ్యక్తం చేశారు.
4. 'హెల్తీ ఇండియా - హ్యాపీ ఇండియా' నినాదం సాకారం కావాలంటే, పిల్లలకు వ్యాయామం తప్పనిసరిగా అలవాటు చేయాలని కేంద్ర సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు.
5. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా ఈ నెల 14, 15, 16 తేదీల్లో కోస్తాంధ్ర, రాయలసీమ జిల్లాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది.

==========================

ఆఫ్రికా దేశాలతో భారత్ సంబంధాలను విస్తరించడం, బలోపేతం చేయడం లక్ష్యంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము.. అల్జీరియా, మౌరిటానియా, మలావిల్లో పర్యటన కోసం ఈరోజు ఉదయం 10 గంటలకు బయల్దేరారు. జీ-20 అధ్యక్షత బాధ్యతలో భారత రాష్ట్రపతి ఆఫ్రికన్ దేశాలను సందర్శించడం ఇదే తొలిసారి. ఈ పర్యటనలో ఆయా దేశాధినేతలతో ద్వైపాక్షిక సమావేశాలలో ఆమె పాల్గొంటారు.

-------------------------

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 2021లో ప్రారంభించిన పీఎం గతిశక్తి జాతీయ బృహత్ ప్రణాళిక ఈరోజుతో మూడు సంవత్సరాలు పూర్తిచేసుకుంది. ఈ సందర్భంగా సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా ప్రధాన మంత్రి నరేంద్రమోదీ మాట్లాడుతూ ఈ కార్యక్రమం దేశ వ్యాప్తంగా ఉన్న బహుళవిధ రవాణా మార్గాల అనుసంధానతను పెంచడంతో పాటు, ఉద్యోగాల కల్పనకు అవకాశం కల్పించిందని అన్నారు. కేంద్ర పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ మాట్లాడుతూ భారతదేశం మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల రూపకల్పన అమలులో ప్రధానమంత్రి గతిశక్తి మార్పును తీసుకువచ్చిందన్నారు. బహుళ మంత్రిత్వ శాఖలు, వివిధ రాష్ట్రాల నుండి సమాచారాన్ని సమగ్రపరచడం ద్వారా, మరింత సమర్థవంతమైన, పారదర్శకమైన వ్యవస్థను సృష్టించినట్లు ఆయన పేర్కొన్నారు.

-------------------------

---------------------------

ఆరోగ్యం అంటే కేవలం శరీరానికి మాత్రమే కాదని.. మనసుకు కూడా సంబంధించిందని కేంద్ర సహాయమంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. జాతీయ తపాలా వారోత్సవాలలో భాగంగా గుంటూరు నగరంలో ఈరోజు నిర్వహించిన ఇండియా పోస్ట్ రన్ 2024 కార్యక్రమ బహుమతి ప్రధానోత్సహంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శారీరక దృఢత్వం ఉన్నవారు చురుకుగా ఆలోచిస్తారని, సమస్యలను వేగంగా పరిష్కరిస్తారని తెలిపారు. 'హెల్తీ ఇండియా – హ్యాపీ ఇండియా' నినాదం సాకారం కావాలంటే.. చిన్నప్పటి నుంచి పిల్లలకు వ్యాయామం, నడక, ఆటలు తప్పనిసరిగా అలవాటు చేయాలని సూచిస్తూ..

(వాయిస్ – 30 సెకన్లు)

---------------------------

విజయవాడ ఇంద్రకీలాద్రిపై శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహించినట్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా తెలిపారు. సంస్కృతి, సంప్రదాయాల్లో పండగలు అంతర్భాగమని.. వాటి పవిత్రత కాపాడుకోవడం మనందరి బాధ్యత అని ఆయన సూచించారు. మరోవైపు తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలను సమర్ధవంతంగా నిర్వహించడంపై ముఖ్యమంత్రి హర్షం వ్యక్తం చేశారు. బ్రహ్మోత్సవాల విశిష్టత, వైభవం ఉట్టిపడేలా తిరుమల తిరుపతి దేవస్థానం ఏర్పాట్లు చేసిందని చంద్రబాబు పేర్కొన్నారు.

---------------------------

తెలుగు దేశం పార్టీ కేంద్ర కార్యాలయం, చంద్రబాబు నాయుడు నివాసంపై దాడి కేసులను రాష్ట్ర ప్రభుత్వం సీఐడీకి అప్పగించింది. ప్రస్తుతం మంగళగిరి, తాడేపల్లి పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఈ కేసుల విచారణ జరుగుతుండగా వాటిని సీఐడీకి బదిలీ చేస్తూ ఈరోజు ఉత్తర్వులు జారీ చేసింది. కేసుల విచారణ వేగవంతం చేసేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు.

---------------------------

అంకురాలతో సాంకేతికతను ఏకీకృతం చేయడం ద్వారా వరద బాధితులకు సహాయం చేయడం సులభమయిందని రాష్ట్ర మంత్రి నారా లోకేష్ సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా అన్నారు. స్టార్టప్ ఆంధ్ర ఒక నినాదంగా మాత్రమే కాకుండా.. పరిపాలన విధానాన్ని సైతం మారుస్తుందని ఆయన తెలిపారు. ఇటీవల వచ్చిన వరద విపత్తును ఎదుర్కోవడంలో అంకుర సంస్థలు ఎంతో ఉపయోగపడ్డాయని ఆయా సంస్థల సహకారంతో బాధితుల గణన, పరిహారం త్వరితగతిన చేపట్టడం జరిగిందని ఆయన పేర్కొన్నారు.

---------------------------

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో గతరాత్రి జరిగిన దసరా ఉత్సవాలలో రాష్ట్ర కార్మిక శాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్ పాల్గొన్నారు. ఈ ఉత్సవాలలో సంప్రదాయ కళలైన కర్రసాము, కత్తిసాములను ప్రదర్శించారు. వీటిని తిలకించేదుకు జిల్లాతోపాటు రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుండి అధిక సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు. ఈసందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ మంత్రి హోదాలో తొలిసారి దసరా ఉత్సవాల్లో

పాల్గొనటం ఆనందంగా ఉందని కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి సంక్షేమం అందరికీ అందించడమే ప్రభుత్వ లక్ష్యమనీ తెలుపుతూ......

(వాయిస్ - 25 సెకన్లు )

---------------------------

దేశంలో తయారయ్యే విదేశీ మద్యం ధరకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం చట్టసవరణ చేసింది. గరిష్ఠ కొనుగోలు ధరపై అదనపు ప్రివిలేజ్ సుంకం విధిస్తూ నోటిఫికేషన్ విడుదల చేసింది. రాష్ట్ర గవర్నర్ ఆమోదం మేరకు ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శి ముఖేశ్ కుమార్ మీనా ఈ మేరకు గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేశారు.

---------------------------

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా ఈ నెల 14, 15, 16 తేదీల్లో కోస్తాంధ్ర, రాయలసీమ జిల్లాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తాయని అమరావతిలోని భారత వాతావరణ శాఖ హెచ్చరించింది. అత్యవసర సహాయక చర్యల కోసం టోల్ ఫ్రీ నంబర్లు 1070, 112, 1800-425-0101ను సంప్రదించాలని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ కోరింది. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాగులు, కాలువలు, రోడ్లు, కల్వర్టులకు దూరంగా ఉండాలని పేర్కొంది.

---------------------------

ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన ఆవర్తనం కారణంగా తిరుపతి జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశముందన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ప్రజలకు సహాయక చర్యలు అందించేందుకు వీలుగా తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు కమిషనర్ ఎన్.మౌర్య ఈరోజు ఒక ప్రకటనలో తెలిపారు. రేపటి నుండి నాలుగు రోజుల పాటు వర్షాలు ఎక్కువగా కురవనున్నాయని, ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, తుఫాను ప్రభావంతో ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా కంట్రోల్ రూము నంబర్ 0877 2256766 ను సంప్రదించాలని కోరారు. అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది, సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు.

---------------------------

ఏలూరు జిల్లాలోని ఏలూరు ఆశ్రమ ఆసుపత్రి జాతీయ రహదారి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో పదిమందికి తీవ్ర గాయాలు కాగా.. ముగ్గురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. తుని నుండి విజయవాడ వెళ్తున్న ఆటోను బొలెరో వాహనం ఢీ కొనడంతో ఈ ప్రమాదం జరిగినట్లు అధికారులు గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన వారిని ఏలూరు సర్వజన ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

---------------------------

తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతుంది. సర్వదర్శనానికి సుమారు 24 గంటల సమయం, ప్రత్యేక ప్రవేశ దర్శనానికి 4 గంటల సమయం పడుతున్నట్లు అధికారులు తెలిపారు. శనివారం అర్ధరాత్రి వరకు 73 వేల 684 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు తిరుమల తిరుపతి దేవస్థానం ఒక ప్రకటనలో తెలిపింది.

=====================